సాక్షి
నాగర్‌కర్నూల్

బుధవారం, 24, మే, 2023



క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

క్రికెట్ బెట్టింగ్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది.

వివరాలు 8లో ▸



ఏడాది గడువు కావాలె..

చిన్నోనిపల్లిని విడిచి వెళ్లాలంటే ఏడాది గడువు కావాలని నిర్వాసితులు ఆర్డీఓను కోరారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.6 /27.4

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలికపాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

27న హజ్ యాత్రికులకు టీకా

కందనూలు: జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న భక్తులకు ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడ వద్ద గల మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న జేఎస్ గార్డెన్‌లో టీకా శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేఖ్ ఫరీద్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు కొరమ్‌పేట మదర్సాకు చెందిన ముఫ్తీ తస్లీం అన్సారీ శిక్షణ ఇస్తారన్నారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. శిబిరాన్ని జిల్లాకు చెందిన హజ్ యాత్రికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కార్పొరేట్ కళాశాలలకు దరఖాస్తు చేసుకోవాలి

కందనూలు: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకునేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, డిసేబుల్డ్, మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి రాంలాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 7.0 జీపీఏ ఆపై సాధించిన ఆయా విద్యార్థులు వచ్చే నెల 3 వరకు ఆన్‌లైన్‌లో ఈ–పాస్ వెబ్‌సైట్ నందు website:epass.cgg.gov.in దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నంబర్ 08540– 295566ను సంప్రదించాలని కోరారు.

'ఎవరి కోసం నోట్ల రద్దు?'

నాగర్‌కర్నూల్ రూరల్: పెద్దనోట్లను రద్దు చేసి కొన్ని వేల మంది చావులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కారణమయ్యాడని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. మంగళవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో పెద్దనోట్లను రద్దు చేసి వాటి కన్నా పెద్దదయిన రూ.2 వేల నోటు తెచ్చారని, ఇప్పుడు ఆ నోటును కూడా ఆర్‌బీఐ రద్దు చేసిందని, ఇవన్నీ ఎవరి కోసం చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. మోదీకి కావాల్సిన పారిశ్రామికవేత్తల కోసమే ఈ నోట్లు రద్దు చేస్తున్నారని విమర్శించారు. పెద్దనోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థను దిగజార్చినందుకు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్‌గౌడ్, నాయకులు శ్రీనివాసులు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్వింటాకు రెండు కిలోలే తీసుకోవాలి



బిజినేపల్లి: రైస్ మిల్లర్లు రైతులు తీసుకువచ్చిన వరిధాన్యం నుంచి క్వింటాల్‌కు కేవలం రెండు కిలోలు మాత్రమే అదనంగా తీసుకోవాలని, అంతకు మించి ఎక్కువ ధాన్యం సేకరిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. అంతేకాక వరిధాన్యాన్ని తూర్పు పట్టి, ఆరబెట్టుకుని వచ్చిన రైతుల నుంచి ఒక గింజ ధాన్యం కూడా అధికంగా తీసుకోవడానికి వీల్లేదని చెప్పారు. మంగళవారం మండలంలోని వట్టెంలో తుల్జాభవాని, శ్రీవేంకటేశ్వర రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైస్ మిల్లర్లతో మాట్లాడుతూ రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు గురిచేయవద్దని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్ని కులవృత్తుల అభివృద్ధే లక్ష్యం

వనపర్తి టౌన్: సీఎం కేసీఆర్ హయాంలో అన్ని కులవృత్తులు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఈదుల చెరువులో సుమారు 7–8 కిలోలు బరువు గల చేపలు పడటంతో మత్స్యకారులు జిల్లాకేంద్రంలోని క్యాంప్ ఆఫీస్‌లో మంత్రికి చేపలను చూయించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని కులవృత్తుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందని, ఇప్పటికే దాదాపుగా అన్ని కులాలు అభివృద్ధి చెందాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణలోనే అందుతున్నాయని గుర్తుచేశారు. ఈ మేరకు మత్స్యకారులు మంత్రి నిరంజన్‌రెడ్డి వల్లే తమ కుటుంబాల ఆర్థిక స్థితి బాగుందని అభిప్రాయపడ్డారు.



ఫెయిల్యూరే.. సక్సెస్‌కు నాంది

- తాత ఉపాధ్యాయుడు, నాన్న పోలీస్
- సమాజాభివృద్ధి.. దేశ భవిష్యత్ కోసం మేకింగ్ పాలసీ
- 'సాక్షి'తో సివిల్స్ ర్యాంకర్ ఉమాహారతి

ఏ పనైనా.. ఏ ఉద్యోగమైనా సాధించాలంటే ముందు ఫెయిల్యూర్ తప్పదు. ఫెయిల్ అయ్యామని పక్కకు పెట్టొద్దు. నిన్నటి ఫెయిల్యూర్.. ఈ రోజు సక్సెస్‌కు నాంది అయింది. సివిల్స్ రాసినప్పుడల్లా మంచి ర్యాంకు రాలేదని నేను ఎప్పుడూ బాధపడలేదు. నన్ను మా ఇంట్లో సైతం ఎవరూ ఏమీ అనలేదు. మొత్తంగా ఐదుసార్లు సివిల్స్ రాస్తే.. ఇప్పుడు మూడో ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది.

నారాయణపేట: సివిల్స్‌లో జాతీయస్థాయిలో ర్యాంకు సాధించడమంటే మామూలు విషయం కాదు.. అలాంటిది నారాయణపేట ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు కుమార్తె ఉమాహారతి యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించి తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆమె సొంత ప్రాంతం సూర్యాపేట, తండ్రి పనిచేస్తున్న నారాయణపేట జిల్లా ప్రజల నుంచి అభినందనలు అందుకుంటుంది. ఈమె తాత సైదులు ఉపాధ్యాయుడు కాగా.. తండ్రి ఎస్. వెంకటేశ్వర్లు ప్రస్తుతం నారాయణపేట జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ తన అభిప్రాయాలను వెల్లడించింది.



అభినందనల వెల్లువ

ఉమాహారతి సివిల్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించడంతో మంగళవారం జిల్లా పోలీసు శాఖలో అధికారులు, సిబ్బంది సంబరాలు జరుపుకొన్నారు. ఎస్పీ క్యాంపు కార్యాలయానికి చేరుకొని ఉమాహారతికి పూలబొకేలు అందజేసి స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. అలాగే కలెక్టర్ కోయ శ్రీహర్షతో పాటు అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ ఆమెను అభినందించారు. టీయూడబ్ల్యూజేహెచ్ 143 యూనియన్ జర్నలిస్టుల బృందం ఆమెకు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.

■ ఐఐటీలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. కానీ, నేను ఉద్యోగం కోసం.. ప్లేస్‌మెంట్ కోసం ఎక్కడా దరఖాస్తు చేయలేదు. ట్రై చేస్తే సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రభుత్వమో, ప్రైవేట్‌లోనో ఉద్యోగం వచ్చేది. నా ఏకైక లక్ష్యం ఐఏఎస్. దానికోసమే ఐదుసార్లు దరఖాస్తు చేశా. అప్పుడే ఏదో ఒక ఉద్యోగంలో చేరి ఉంటే ఈ రోజు ఐఏఎస్ అయ్యే చాన్స్ మిస్సయ్యేదాన్ని. నా తల్లిదండ్రులు ఎప్పుడూ ఉద్యోగం చేయమని ఒత్తిడి చేయలేదు. పెళ్లి మాటే ఎత్తలేదు. నా జీవితానికి బంగారు భవిష్యత్ ఇచ్చారు. నేను దేశానికి మంచి భవిష్యత్ ఇవ్వాలనుకుంటున్నా.

దేశ భవిష్యత్‌తో పాటు సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా పాలసీ మేకింగ్‌యే లక్ష్యం. క్షేత్రస్థాయి నుంచి దేశాభివృద్ధి కోసం పాలసీ మేకింగ్ చేయాలంటే అది ఒక ఐఏఎస్‌కే సాధ్యమవుతుంది. అందుకే ఐఏఎస్ కావాలని లక్ష్యంగా పెట్టుకొని ఐదేళ్ల నుంచి కష్టపడి చదివా. మొత్తంగా ఐఏఎస్‌కు ఎంపికైనందుకు సంతోషంగా ఉంది.

ఐఏఎస్‌గా విధుల్లో చేరిన తర్వాత దేశంలో ఎక్కడ ఉద్యోగం వచ్చినా మహిళల అభ్యున్నతి, విద్యాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా. తెలంగాణ ఆడబిడ్డగా రాష్ట్రానికి మంచి పేరు తీసుకువస్తా. మహిళలను విద్యావంతులను చేయడం, అన్నిరంగాల్లో వారిని రాణించేలా ప్రోత్సహించడం, ఆర్థికంగా ఎదిగే విధంగా తోడ్పాటునందిస్తా. ఎక్కడ పనిచేసిన అక్కడ నిరక్షరాస్యత లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముందుకు సాగుతా.



మాట్లాడుతున్న ఉమాహారతి

పేదల ఆరోగ్యం, చదువుపై దృష్టి..

- నిరుపేదల కష్టాలను చూసే సివిల్స్‌కు సిద్ధమయ్యా
- నాలుగేళ్ల పాటు నిరాటంకంగా ప్రయత్నించా
- సివిల్స్‌లో 630వ ర్యాంక్ సాధించిన దీప్తిచౌహాన్
- నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన దీప్తి

సాక్షి, నాగర్‌కర్నూల్: నిరుపేదల కష్టాలను కళ్లారా చూసి, తాను సివిల్స్ సాధించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నానని ఆలిండియా సివిల్స్ ర్యాంకర్ దీప్తి చౌహాన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రానికి చెందిన ఆమె ఎంబీబీఎస్ చదివి సివిల్స్ వైపు మళ్లారు. 2020లో యూపీఎస్సీ ఇంటర్వ్యూ వరకు వెళ్లి త్రుటిలో ర్యాంకును కోల్పోయారు. నాలుగోసారి ప్రయత్నించిఆలిండియా 630వ ర్యాంకును సాధించారు. ఈ సందర్భంగా తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

డాక్టర్ నుంచి సివిల్స్ వైపు..

నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలకేంద్రానికి చెందిన దీప్తి చౌహాన్ గిరిజన కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి కిషన్‌లాల్ వనపర్తి జిల్లా పెద్దమందడి ఏపీజీవీబీలో మేనేజర్‌గా పనిచేస్తుండగా, తల్లి చంద్రకళ ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారు. దీప్తి తన చిన్నతనం నుంచి పదో తరగతి వరకు గద్వాలలోని విశ్వభారతి హైస్కూల్‌లో చదివారు. తర్వాత హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 2012లో ఆదిలాబాద్ రిమ్స్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సాధించారు. డాక్టర్ కోర్సు చదువుతుండగానే అక్కడి పరిస్థితులను చూసి తన లక్ష్యాన్ని సివిల్స్ వైపు మార్చుకున్నారు. నాలుగేళ్ల పాటు శ్రమించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు.



పేదల కష్టాలను చూసి..

'ఆదిలాబాద్ జిల్లాలోని రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి గిరిజనులే ఎక్కువగా వచ్చేవారు. వారిలో చాలా మందికి కనీసం చెప్పులు కూడా ఉండేవి కావు. వారిని చూశాకే ఇలాంటి వారికి ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నా. డాక్టర్‌గా కన్నా కలెక్టర్ అయితే విస్తృతంగా సేవలు అందించవచ్చని అనుకున్నాను. పేదలకు ఆరోగ్యం, చదువు అందించడంలో నా శక్తి మేరకు కృషి చేస్తాను' అని దీప్తి చెబుతున్నారు.

నాలుగో ప్రయత్నంలో విజయం..

ఎంబీబీఎస్ ఇంటర్న్‌షిప్‌లో ఉండగానే నా ఆలోచనను తల్లిదండ్రులతో పంచుకున్నాను. వారు నాకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చారు. 2020లో నిర్వహించిన యూపీఎస్సీ పరీక్షల్లో ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. అయితే 15 మార్కుల తేడాతో ర్యాంకును కోల్పోవాల్సి వచ్చింది. నాలుగోసారి ప్రయత్నించి విజయం సాధించాను. ఇంటర్వ్యూలో తెలంగాణ ప్రభుత్వ పథకాలపై ప్రశ్నలను అడిగారు. ప్రత్యేకించి మిషన్ భగీరథ పథకం ప్రాముఖ్యత గురించి, పనితీరు గురించి వివరించమన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలతో పాటు హైదరాబాద్‌లో ఏర్పాటైన ఐటీ హబ్ పనితీరు గురించి ప్రశ్నలను అడిగారు. లక్ష్యం ఏదైనా స్పష్టంగా ఉండాలి. కష్టపడితే ఏదైనా సాధించగలమని సివిల్స్ ఆశావహులకు సూచించారు.

గర్భిణులను రక్తహీనత నుంచి కాపాడాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఉదయ్‌కుమార్ తదితరులు

నాగర్‌కర్నూల్ క్రైం: రక్తహీనత తో బాధపడుతున్న పిల్లలు, గర్భిణులను రక్తహీనత నుంచి కాపాడాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రక్తహీనత, పిల్లలకు టీకాలు, కంటివెలుగు, ఆర్‌బీఎస్‌కే, 102 వాహన సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు టీకాలు అన్నీ సక్రమంగా ఇవ్వాల్సిన బాధ్యత ఏఎన్‌ఎంలు, ఆశాలపై ఉందన్నారు. పిల్లలు, గర్భిణులు చాలామంది రక్తహీనతతో బాధపడుతుంటారని, వారిని గుర్తించి సరైన వైద్యం, ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా అందించాలని చెప్పారు. జిల్లాలో 24 వేల మంది కాటరాక్ట్ సమస్యతో బాధపడుతున్నారని, వీరందరికీ శస్త్రచికిత్స చేసేలా చర్యలు తీసుకోవాలని కంటివెలుగు ప్రోగ్రాం ఆఫీసర్‌కు సూచించారు. జిల్లాలో 102 వాహనాలు ఉన్నాయని, వాటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు ప్రసవానికి గాని, టీకాలకు వచ్చినప్పుడు ఈ వాహనాల్లోనే ఉచితంగా తరలించాలన్నారు. అనంతరం వ్యాక్సిన్ నిల్వ ఉంచే గదిని కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, ఇమ్యూనైజేషన్ అధికారి రవినాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాస్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రేణయ్య, వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు తదితరులు పాల్గొన్నారు.

పల్లెదవాఖానాలను పూర్తిచేయండి

జిల్లాలో చేపట్టిన పల్లె దవాఖానా, సబ్ సెంటర్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, పల్లె దవాఖానా, కంటి వెలుగు, సీపీఆర్ శిక్షణలపై కలెక్టర్లు, వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 107 పల్లె దవాఖానాలు మంజూరవగా.. ఇప్పటి వరకు 11 పూర్తి చేశామని, మరో 19 పురోగతిలో ఉన్నాయని చెప్పారు. కొన్నింటికి టెండర్ పూర్తి చేయాల్సి ఉందని, వారం రోజుల్లో ఆ ప్రక్రియ పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేస్తామని వివరించారు.

సమస్యల పరిష్కారానికి ఏకంకావాలి



మాట్లాడుతున్న ఆలిండియా లియాఫీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి

ఆలిండియా లియాఫీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి

కల్వకుర్తి రూరల్: సమస్యల సాధనకు ఎల్‌ఐసీ ఏజెంట్లు సంఘటితం కావాలని ఆలిండియా లియాఫీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి అన్నారు. మంగళవారం కల్వకుర్తిలోని లియాఫీ భవన్‌లో నిర్వహించిన ఇన్సూరెన్స్ ఏజెంట్ల జనరల్ బాడీ సమావేశానికి ఆయనతోపాటు జాతీయ ఉపాధ్యక్షుడు ఎంఎస్ మూర్తి, కోశాధికారి శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసచారి మాట్లాడుతూ ఏజెంట్ల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్తున్నామన్నారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరిగానే ఏజెంట్ల పిల్లల చదువు కోసం ఎల్‌ఐసీలో రుణం అందించేలా మేనేజ్‌మెంట్‌తో మాట్లాడటం జరిగిందన్నారు. యూనియన్ సభ్యత్వాలను పెంచి లియాఫీని మరింత బలోపేతం చేయాలని కోరారు. అనంతరం కల్వకుర్తి, అచ్చంపేట లియాఫీ యూనియన్ నాయకులు వెంకటయ్యగౌడ్, రాంగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి లియాఫీ నాయకులను శాలువాతో సన్మానించారు. అలాగే బ్రాంచ్ మేనేజర్‌గా పదోన్నతిపై వెళ్తున్న కల్వకుర్తి ఎల్‌ఐసీ బ్రాంచ్ ఏబీఎం శశిశేఖర్ దంపతులను బ్రాంచ్ మేనేజర్ హరిలాలు, సిబ్బంది, ఏజెంట్లు ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్‌బీఎం హరిలాల్, హైదరాబాద్ డివిజన్ లియాఫీ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, సుదర్శనం, శ్రీనివాసులు, లియాఫీ కల్వకుర్తి బ్రాంచ్ ప్రతినిధులు వెంకటయ్య, రాంగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, లియాఫీ అచ్చంపేట బ్రాంచ్ ప్రతినిధులు చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రారంభోత్సవానికి చర్యలు



అచ్చంపేటలోని వంద పడకల ఆస్పత్రిని పరిశీలిస్తున్న వైద్య, విధాన పరిషత్ అధికారులు

అచ్చంపేట రూరల్/ ఉప్పునుంతల: నల్లమల ప్రాంతంలోని అచ్చంపేటలో నిర్మించిన అధునాతన 100 పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని వైద్య విధాన పరిషత్ ఇన్‌చార్జ్ కమిషనర్ రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం అచ్చంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అన్ని విభాగాల్లో పరికరాలు, పూర్తి చేయాల్సిన పనులు పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యంతోపాటు వచ్చే సహాయకులకు అన్నిరకాల వసతులు సమకూర్చాలన్నారు. ఈ నెల 29న ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆస్పత్రిని ప్రారంభించనున్నారని, అప్పటిలోగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ఉప్పునుంతలలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట టీఎస్‌ఎంఎస్ ఐడీసీ స్పెషల్ ఆఫీసర్ రాంబాబు, యూనుస్, నాగర్‌కర్నూల్ డీసీహెచ్‌ఎస్ రమేష్‌చంద్ర, ప్రభు, కృష్ణ, రాకేష్, ఫార్మాసిస్టు శ్రీనివాసులు, ఏఈ బాలరాజు తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో.. మొలకెత్తుతున్న వరిధాన్యం



కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం బస్తాలు

కల్వకుర్తి రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం సంచులు మొలకెత్తుతున్నాయి. మండలంలోని గుండూరులో రైతు రమేష్ వారం రోజుల క్రితం 82 బస్తాల ధాన్యం తూకం వేశారు. అయితే ధాన్యాన్ని తీసుకునేందుకు ఇప్పటి వరకు ఏ ఒక్క మిల్లర్‌కు చెందిన లారీ రాలేదు. ఈ క్రమంలోనే కురిసిన అకాల వర్షాలకు ధాన్యం మొత్తం తడిసిపోయింది. మంగళవారం ధాన్యం సంచులపై కప్పిన టార్పాలిన్ కవర్ తెరచి చూడగా మొలక వచ్చింది. అయితే మిల్లర్లు దళారులు ధాన్యం ఎక్కడ ఉంటే అక్కడ లారీలో తీసుకుని వెళ్తుండగా.. రైతుల ధాన్యం తీసుకుపోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం మొలకెత్తిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకుంటారా లేదా అనే భయాందోళన రైతులు వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు వెచ్చించి దశాబ్ది ఉత్సవాలా?

- సంతోషంగా ఉంటే ప్రజలే స్వచ్ఛందంగా జరుపుతారు
- తెలంగాణ ఏర్పాటు తర్వాత ఒరిగిందేమీ లేదు
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం

జడ్చర్ల/ నవాబుపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను డబ్బులు ఖర్చు చేసి జరుపుతారా.. నిజంగా తెలంగాణ సాధన లక్ష్యాలు నెరవేరితే ప్రజలే తమ గుండెల నుంచి భక్తిభావంతో స్వచ్ఛందంగా పండుగలు జరుపుకొనేవారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం నవాబ్‌పేట మండలంలోని రుక్కంపల్లి బసకేంద్రం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా మల్లారెడ్డిపల్లి శివారులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ది సంబరాలకు ప్రభుత్వం రూ.200 కోట్లు విడుదల చేయడమే ఇందుకు నిదర్శనం అన్నారు. డబ్బులు ఇచ్చి పండుగలు చేయించుకునే పరిస్థితి కాదని, ఈ సంబరాలు తెలంగాణ పాలకుల కోసమేనని విమర్శించారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాల లక్ష్యాలతో సాధించుకున్న తెలంగాణలో అవి ఎంత వరకు నెరవేర్చారని ప్రశ్నించారు. వీటిపై ఊరువాడ రాష్ట్రమంతా చర్చ జరగాలని, మేధావులు, విద్యార్థులు, జర్నలిస్టులు, కళాకారులు, ప్రజలు సెమినార్ ఏర్పాటు చేసి చర్చించాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ భూస్వామ్య వ్యవస్థకు పునర్నిర్మాణం చేశారని మండిపడ్డారు.

నేటి పాదయాత్ర ఇలా..

భట్టి విక్రమార్క పాదయాత్ర బుధవారం జడ్చర్ల మండలంలోని కిష్టారం నుంచి ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి ఉదండాపూర్ రిజర్వాయర్ చేరుకున్న తర్వాత మధ్యాహ్న భోజనం కోసం కొంత విరామం తీసుకుంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి ఉదండాపూర్ మీదుగా వల్లూరు, బండమీదిపల్లికి చేరుకుంటుంది. రాత్రికి అక్కడే బస చేస్తారని నిర్వాహకులు తెలిపారు.



నవాబుపేట మండలం మల్లారెడ్డిపల్లిలో భట్టికి గొర్రె పిల్ల, గొంగడి అందజేస్తున్న గ్రామస్తుడు

గడప గడపను తాకుతూ..

గడప గడపను తాకుతూ.. వారి గుండెలోని బాధలు వింటూ.. భరోసా కల్పిస్తూ భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర కొనసాగింది. ఐదు రోజుల విరామం అనంతరం మంగళవారం రుక్కంపల్లి నుంచి 68వ రోజు పాదయాత్ర పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా జనం ఆయనకు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. చెన్నారెడ్డిపల్లికి చెందిన గొల్ల పెంటయ్య, లక్ష్మమ్మ దంపతులు తమ పూరిగుడిసెను చూపించి ఇదే మా ఆస్తి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటూర్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో పది రోజులుగా ధాన్యం కొనడం లేదని రైతులు భట్టికి వివరించారు. అదే గ్రామానికి చెందిన జాఫర్ తనకు ఇల్లు లేదని.. డబుల్ బెడ్‌రూం ఇల్లు సైతం కేటాయించలేదని వాపోయారు.

పాదయాత్రలో గద్దర్ సందడి

భట్టి పాదయాత్రలో ప్రజా గాయకుడు గద్దర్ సందడి చేశారు. పాదయాత్రలోనే భట్టి, గద్దర్ కలిసి వీడియో కాల్‌లో కాంగ్రెస్ నేత, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రాత్రి కూచూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. మండలంలో భట్టి పాదయాత్ర ముగియడంతో కేక్ కట్ చేసి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు సంపత్‌కుమార్, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, డీసీసీ నాయకులు దుశ్యంత్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, బంగ్ల రవి, జహీర్, రామచందర్, తులసీరాంనాయక్, ఖాజా, సురేష్, రాజేష్, రమేష్, శ్రీహరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జిల్లా షీటీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా షీటీం ఇన్‌చార్జ్, విజయలక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో షీ టీం బృందం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో టెక్నాలజీ పెరిగే కొద్దీ ఉపయోగంతోపాటు మహిళలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. విద్యార్థులు ఏదైనా సమస్యకు గురైతే తక్షణమే షీ టీంకు సమాచారం అందించాలన్నారు. వేధింపులకు గురైనవారు షీ టీం నంబర్ 87126 57676కు సమాచారం అందిస్తే రక్షణ కల్పిస్తామని చెప్పారు. ప్రస్తుత సమాజంలో చిన్న వయసులోనే ప్రేమ అనే ట్రాక్‌లో పడి విద్యార్థులు జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్రంగా కృంగిపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో షీ టీం మెంబర్ వెంకటయ్య, కళాశాల ప్రిన్సిపల్ కమర్ షాజహాన్ సుల్తానా, ఉమెన్ ఎంపవర్‌మెంట్ అధికారి ఉమాదేవి, వనిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

బొలెరో ఢీకొని వృద్ధురాలి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: బొలెరో వాహనం ఢీకొని వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దముద్దునూరులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. పెద్దముద్దునూరు గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(58) తన ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా, ఎవరూ ఫిర్యాదు చేయలేదని, విచారణ చేస్తామని తెలిపారు.

చెట్టును ఢీకొని వ్యక్తి..


నగేష్

అయిజ: బలమైన ఈదురు గాలులకు రోడ్డుపై పడిపోయిన చెట్టును ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని వెంకటాపురం స్టేజీ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వెంకటాపురం స్టేజీ సమీపంలో సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. బలమైన గాలులు వీచడంతో అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారి సమీపంలోని పెద్ద వృక్షం రోడ్డుపై పడిపోయింది. చీకటి పడటంతో గమనించని ఉప్పల క్యాంపునకు చెందిన నగేష్ (55) మోటార్‌సైకిల్‌పై వెళ్తూ రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును ఢీకొట్టాడు. చెట్టు కొమ్మలు గుచ్చుకోవడంతో పాటు రోడ్డుపై పడిన నగేష్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో రక్తస్రావమై స్పృహ కోల్పోయాడు. గమనించిన సమీపంలోని వెంకటాపూర్ స్టేజి ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. మార్గమధ్యంలో నగేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రోడ్డు రోలర్ కిందపడి మహిళ..

ధన్వాడ: రోడ్డు రోలర్ కిందపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ధన్వాడ మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. మరికల్ మండల కేంద్రానికి చెందిన కానుగంటి నాగమణి(48) తన తల్లిగారి ఊరైన కోయిల్‌కొండలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలకు వెళ్లింది. భర్త నర్సిములుతో టీవీఎస్ లూనపై వెళ్లి తిరిగి మంగళవారం రోజు సాయంత్రం మరికల్‌కు వస్తుండగా కొండాపూర్ వద్ద బీటీరోడ్డు వేస్తున్న రోడ్డు రోలార్ కిందపడి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

గోపాల్‌పేట: ఆరుబయటికి వెళ్లిన వృద్ధురాలు మృతి చెందిన ఘటన రేవల్లి మండలంలోని పాత బండరావిపాకులలో మంగళవారం చోటుచేసుకుంది. రేవల్లి ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. పాత బండరావిపాకులకు చెందిన అనంతమ్మ(65) ఆమె కొడుకుతో పాటు ఉంటోంది. మంగళవారం ఉదయం ఆరుబయటికి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాలేదు. వెతికి, 200మీటర్ల దూరంలో బావిలో పడినట్లు గుర్తించారు. బయటికి తీసి చూడగా అప్పటికే మరణించింది. కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అనంతమ్మ భర్త మరణించగా ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్పదర్శి చైతన్య

మహబూబ్‌నగర్ రూరల్: ఈ కుబేర్‌లో ఉన్న ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కల్పదర్శి చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బీటీఏ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిసెలవుల్లోనే పదోన్నతులు, బదిలీలు చేపట్టి ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించాలన్నారు. డీఎస్సీని నిర్వహించి ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకం రాగి జావా అందించడం హర్షణీయమన్నారు. సమావేశంలో బీటీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వడ్డెమాన్ బాలపీరు, జిల్లా అధ్యక్షుడు పట్నం చెన్నయ్య, రాష్ట్ర కార్యదర్శి మేడం విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి సత్తయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, కేసీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు


ఆదోని పోలీసుల అదుపులో అయిజకు చెందిన వ్యక్తి, ముఠా సభ్యులు (ఫైల్)

జిల్లాలో ఏపీ పోలీసులు ముమ్మర గాలింపు

- పదిరోజుల క్రితం తనగలలో అదుపులోకి తీసుకున్న వైనం
- కర్నూలు పోలీసుల కస్టడీలో అయిజవాసులు
- ఆట మొత్తం ఆన్‌లైన్‌లోనే..

గద్వాల క్రైం: ఐపీఎల్ మ్యాచ్‌లకు పందెం కాయాల్సిందే.. బంతి బంతికి ఓ రెటు.. రూ.వెయ్యి నుంచి రూ.5 వేలు.. మ్యాచ్ జరుగుతుందంటే చాలు ఆటకు ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులు. ఓ నాలుగు గంటల సమయంలో రూ.కోట్లు ఖాతాల్లోకి మారుతున్నాయి. బుకీలుగా ఉన్న వారికి 10 శాతం కమీషన్‌తో బెట్టింగ్ జోరు సాగుతుంది. ఈ వ్యవహారం మార్చి 31 నుంచి జోగుళాంబ గద్వాల జిల్లాలో జోరందుకుంది. క్రికెట్ మ్యాచ్‌ల ప్రారంభంతో బెట్టింగ్ ముఠాకు కాసుల వర్షం కురిపిస్తుంది. అయితే ఏపీలోని కర్నూలు జిల్లా పోలీసు శాఖ (ఆదోని) పోలీసులు నిఘా ఉంచి బెట్టింగ్ ముఠాకు చెమటలు పట్టించింది. ఈ నెల 10న వడ్డేపల్లి మండలం తనగాలలో క్రికెట్ బెట్టింగ్ ముఠాకు సంబంధించిన కీలక వ్యక్తిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని ఆట కట్టించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అయితే ముఠాకు సంబంధించిన కీలక వ్యక్తి అయిజకు చెందిన వడ్ల రాఘవేంద్రఆచారిగా గుర్తించి ఆ ముఠా సభ్యుల నుంచి రూ.80 లక్షల నగదు, కారు, బైక్‌లు, సెల్‌ఫోన్స్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. అక్కడి పోలీసులు గుర్తించిన వైనంతో ఇక్కడి జిల్లా పోలీసుశాఖ విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

2017లో చెక్..

జోగుళాంబ జిల్లా మొదటి ఎస్పీగా విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచి జూలై 13న క్రికెట్ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా జిల్లా మొత్తం జల్లెడపట్టి 120 మంది సభ్యులపై కేసు నమోదు చేసి రూ.4 కోట్ల మేర ఆస్తులను సీజ్ చేశారు. ఈ వ్యవహారంలోనూ అయిజకు చెందిన వడ్ల రాఘవేంద్రఆచారితోపాటు అంతర్రాష్ట్ర సభ్యులు ఉన్నారు. ఆ తర్వాత ఎస్పీ బదిలీ కావడంతో బెట్టింగ్ దందా షరామామూలుగానే జరుగుతోంది. 2019, ఏప్రిల్ 24న గద్వాల– అయిజకు చెందిన ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని రూ.4.38 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అడపాదడపా జిల్లాలో కేసులు నమోదవుతూనే ఉన్నాయి.

జిల్లాలో ముమ్మరంగా గాలింపులు..

ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభం నుంచి అయిజకు చెందిన వడ్ల రాఘవేంద్రఆచారి ముఠా సభ్యులు కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహానంది, హుస్సేన్ (చిడ్డు), మహ్మద్ అంతర్రాష్ట్ర బెట్టింగ్ ముఠాగా ఏర్పడి తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ముఠా సభ్యుల నుంచి బెట్టింగ్ కార్యకలాపాలను సామాజిక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని కొంతమంది యువత, ప్రముఖులు, వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, క్రీడాకారులు బెట్టింగ్ కాస్తున్నారు. ఇక చెల్లింపులు సైతం ఆన్‌లైన్‌లో పలు కోడ్ భాషలు, నగదు చెల్లింపులను ఆన్‌లైన్‌లో బదిలీ చేస్తున్నట్లు ఆదోని పోలీసులు గుర్తించారు. వివిధ ఫోన్ కాల్స్ డేటా ఆధారంగా జరుగుతున్న తతంగంపై ఆరా తీస్తున్నారు. ఇక జోగుళాంబ గద్వాల నుంచి పలు బ్యాంకు ఖాతాల్లోకి నిత్యం రూ.లక్షల్లో నగదు బదిలీ అయినట్లు తెలుసుకుని ప్రత్యేక బృందాలు గద్వాల జిల్లాలోని అయిజ, శాంతినగర్, గద్వాలలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. పక్కా సమాచారం మేరకు ఈ నెల 10న వడ్డేపల్లి మండలం తనగలలో అయిజకు చెందిన కీలక ముఠా సభ్యుడిని అదుపులోకి తీసుకోవడం, అదే సమయంలో ఆదోనికి చెందిన ముఠా సభ్యులను అక్కడ అరెస్టు చేయడంతో ముఠా సభ్యులకు సంకెళ్లు పడ్డాయి.

చర్యలు తీసుకుంటాం..



క్రికెట్ బెట్టింగ్‌లను ఎంత మాత్రం ఉపేక్షించేది లేదు. ఏపీ పోలీసులు ఇక్కడి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకునే విషయంపై ఆరా తీస్తాం. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినట్లు తెలిస్తే దాడులు చేపట్టి చర్యలు తీసుకుంటాం. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత లక్ష్యాల వైపు దృష్టిసారించాలి.

– సృజన, ఎస్పీ, జోగుళాంబ గద్వాల

మోసం చేసిందనే కోపంతో హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ జమ్ములప్ప

రాజాపూర్: తాను అన్ని విధాలా చూసుకుంటున్నా తనను కాదని ఇతరులతో వివాహేతర సంబంధం పెట్టుకుంటుందన్న కోపంతో హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకొన్నాడని జడ్చర్ల రూరల్ సీఐ జమ్ములప్ప తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మంగళవారం రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మండలంలోని పెద్దరేవల్లికి చెందిన మంజులకు మల్లేపల్లికి రాచమల్ల యాదయ్యతో వివాహమైంది. అయితే గతంలోనే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో మంజుల తన తల్లిగారి గ్రామమైన పెద్దరేవల్లిలో ఇల్లు కట్టుకుని తన కొడుకు శ్రీశైలంతో కలిసి జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన యాట చెన్నయ్యతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ మధ్యకాలంలో మంజుల ఇతరులతో కూడా అక్రమ సంబంధం పెట్టుకుంటుందని అనుమానించిన చెన్నయ్య ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 19న ఉదయం 11 గంటలకు మంజుల చెన్నయ్యకు ఫోన్ చేసి తనను బాలానగర్‌కు తీసుకెళ్లాలని కోరింది. ఇదే అదునుగా భావించి చెన్నయ్య బైక్‌పై మంజులను ఎక్కించుకుని బాలానగర్‌కు తీసుకువెళ్లి షాపింగ్ చేసిన అనంతరం ఊరుబయటికి వెళ్లి కల్లు తాగుదామని నమ్మించి అగ్రహారంపొట్లపల్లి శివారులో పెరుమాళ్లగుండు సమీపంలోకి తీసుకెళ్లాడు. అక్కడ మద్యం తాగిన తర్వాత ముందస్తు ప్లాన్ ప్రకారం రాళ్లతో తలపై కొట్టి చంపాడు. ఈ మేరకు మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ జమ్ములప్ప తెలిపారు. సమావేశంలో రాజాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన టాస్క్‌ఫోర్స్ టీం ఆకస్మిక తనిఖీలు


విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీ చేస్తున్న రాష్ట్ర బృందం

మహబూబ్‌నగర్ రూరల్: నకిలీ విత్తనాలను విక్రయించి రైతులను మోసం చేస్తే చట్ట ప్రకారం కఠినచర్యలు తప్పవని ఏడీఏ సుధారాణి హెచ్చరించారు. మంగళవారం ఏడీఏ ఆధ్వర్యంలో రాష్ట్ర విత్తన టాస్క్‌ఫోర్స్ బృందం మహబూబ్‌నగర్‌లోని విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు డీలర్ షాపులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. విత్తన చట్టాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి పత్రాలు, ప్రాసెసింగ్ రిజిస్టర్లు, ఫౌండేషన్ రిజిస్టర్లు, లైసెన్స్‌లు, డెలివరీ ఛాలన్లు, స్టాక్ వివారలు, జీఓటీ రిజిస్టర్, ఫిజికల్ స్టాక్‌ల తదితరాల వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏడీఏ సుధారాణి మాట్లాడుతూ ప్రాసెసింగ్ రిజిస్టర్లను, లైసెన్స్‌లను కచ్చితంగా యూనిట్‌లో ప్రదర్శించాలని సూచించారు. లైసెన్స్‌ల చెల్లుబాటు, కో మార్కెటింగ్ అగ్రిమెంట్ సరిచూసుకోవాలని సూచించారు. ఫౌండేషన్ విత్తన రిజిస్టర్‌లను, ల్యాబ్ ప్రకారం, వెరైటీ ప్రకారం స్టాక్ రిజిస్టర్, ఫిజికల్ స్టాక్ రిజిస్టర్, స్టాక్ బాలెన్స్‌తో సరిపోయే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తేలితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో సీఐ రవికుమార్, ఏఓ శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేనంటే భయమెందుకు?


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

- నడిగడ్డలో అగ్రకులనాయకులదే పెత్తనం
- ఇక్కడ ఇంకా అంటరానితనం ఉంది
- బడుగు, బలహీన కులాలకు రాజ్యాధికారం వస్తేనే మార్పు సాధ్యం
- గద్వాల యువచైతన్య సదస్సులో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల రూరల్: నేనంటే గద్వాలలోని కొందరు నాయకులకు భయం.. అందుకే నేను మీటింగ్‌కు వస్తే కరెంట్ తీశారు.. నేను కుల, మత భేదాలు తెలియకుండా అందరి మధ్య పెరిగిన వ్యక్తిని. కానీ, నడిగడ్డలో పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఇక్కడ కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ ఎస్సీలను ముట్టుకోరు.. దగ్గరకు రానీయరు.. ఇలాంటి పరిస్థితి ఎక్కడా చూడలేదు. ఇక్కడ రాజ్యాధికారం అంతా కొందరి చేతిలో బంధీ అయింది. ఇక్కడ జరుగుతున్న మీటింగ్‌కు చాలామంది రావాల్సి ఉన్నా.. కొందరు నాయకుల దౌర్జన్యానికి భయపడి రాలేకపోయారు. దీంతో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలను కేవలం బానిసలుగా చూస్తున్నారు.. ఈ పరిస్థితి మారాలంటే మనకే రాజ్యాధికారం దక్కాలి.. ఇక్కడున్న వారికి ఎవరికి అవకాశం వచ్చినా నేను అండగా నిలబడతాను.. మీకోసం ఎదురెళ్లడానికి సిద్ధంగా ఉన్నా.. నాకు మీరు అండగా నిలబడాలి అంటూ జెడ్పీ చైర్‌పర్సన్ కె.సరిత ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మల్దకల్‌లో నిర్వహించిన గద్వాల యువచైతన్య సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయడం కలకలం రేపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గద్వాలలో ఒక్కసారి బలహీన వర్గానికి చెందిన గట్టుభీముడికి అవకాశం వచ్చిందని, అన్న భీముడు అన్ని వర్గాలకు అండగా నిలబడ్డాడని, ఇప్పుడు నాకు అవకాశం ఇస్తే బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు సేవ చేస్తూ అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు. మన ఓటు మనమే వేసుకుందామని, మనల్ని మనమే గెలిపించుకుందామన్నారు. మార్పు ఒక్కరితోనే మొదలవుతుంది. ఆ ఒక్కరు నేనై మొదలుపెడతానని, నాకు మీరంత అండగా నిలబడాలని కోరారు. గద్వాలలో మనల్ని అణచివేతకు గురిచేస్తున్నారని, అందుకే మిమ్మల్ని పదే పదే అడుగుతున్నా.. ముఖ్యంగా యువత చెబుతున్నా.. మీరు ఇక్కడికి రాకపోవడానికి రకరకాల భయాలే కారణమని తెలుసు.. కానీ, నేను చెప్పేది మీరు కచ్చితంగా వింటారు. ఎందుకంటే ఫేస్‌బుక్‌లో ఎంతమంది నన్ను ఫాలో అవుతారో నాకు తెలుసు. చదువుకున్న యువత ముందుకు రావాలి. ఎన్నికల సమయంలో మీకు క్రికెట్ టోర్నమెంట్ అంటూ పక్కదోవ పట్టించి మోసం చేసేందుకు ఇక్కడి కొందరు నాయకులు కుయుక్తులు పన్నుతారు. వారి కుతంత్రాలకు మోసపోకుండా చైతన్యులు కావాలి. అప్పుడే మనం అభివృద్ధి చెందుతాం. వెనకబడ్డ జాతులు బాగుపడటానికి ముందుకొచ్చిన నాయకుడికి నేను అండగా ఉంటా.. నాకు మీరు అండగా ఉండాలి. నా దృష్టిలో రెండే కులాలున్నాయి. ఒకటి మంచితనం, రెండు చెడుతనం. జనాలకు మేలు చేసే కులం అగ్రకులమైతది కానీ, తెల్లబట్టలు వేసుకుని జనాలకు కీడు చేసుకుంటూ హింసిస్తూ నేను అగ్రకులస్తుడిని అంటే సరిపోదంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సభలో పాల్గొన్న పలువురు వక్తలు ఈసారి అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే టికెట్ ఇవ్వాలని డిమాండు చేశారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో బీసీ బలమేంటో చూపిస్తాం అన్నారు.

కూతురిపై తండ్రి అఘాయిత్యం

భూత్పూర్: సమాజంలో మానవత్వం మంటకలిసిపోతుంది. బంధాలు, బంధుత్వమనే తారతమ్యం లేకుండా కన్న కూతురిపైనే ఓ తండ్రి అత్యాచారం చేసిన సంఘటన మండలంలోని ఓ గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి కథనం గ్రామానికి చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె(14) ఓ కేజీబీవీలో 7వ తరగతి చదువుతుంది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో స్వగ్రామానికి వచ్చింది. మంగళవారం కడుపు నొప్పి వస్తుందని బాలిక తల్లికి చెప్పగా.. ఏం జరిగిందని అడగడంతో పదిరోజుల క్రితం తండ్రి తనపై అత్యాచారం చేశాడని, ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడని వాపోయింది. గత డిసెంబర్‌లోనూ అత్యాచారానికి పాల్పడ్డాడని చెప్పింది. రెండేళ్ల క్రితం పెద్ద కూతురిని సైతం బెదిరించి అత్యాచారం చేసినట్లు ఇటీవల తెలిసిందని తల్లి భూత్పూర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. దీంతో బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

బిజినేపల్లి: కూతుళ్లతోపాటు ఈతకు వెళ్లి గల్లంతైన మీసాల జానకిరాములు మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది. సోమవారం మధ్యాహ్నం కూతుళ్లతోపాటు ఈతకు వెళ్లిన జానకిరాములు సరదాగా తాను కూడా బావిలో దూకగా.. ప్రమాదశాత్తు ఈత కోడుతూ గల్లంతయ్యాడు. దీంతో అతని కోసం బావిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి.. అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

జూరాల స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,216 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.371 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయండి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

- మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు


కొల్లాపూర్: స్థానిక మార్కెట్‌యార్డుకు రైతులు విక్రయానికి తీసుకొచ్చిన వరిధాన్యాన్ని మంగళవారం మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వరి ధాన్యం యార్డుకు తీసుకొచ్చి పది రోజులు అవుతున్నా కొనుగోలు చేయడం లేదని, తూకం చేసినా రసీదులు ఇవ్వడం లేదని వివరించారు. దీంతో జూపల్లి వెంటనే అదనపు కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. మిల్లర్లకు కొమ్ము కాస్తూ రైతులను ఇబ్బందులకు గుర్తిచేస్తున్నారని తెలిపారు. క్వింటాకు 5 కిలోల మేర తరుగు తీస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కౌన్సిలర్లు రహీం పాషా, బాలస్వామి, నాయకులు పసుపుల నర్సింహ, ఎక్బాల్, కేతూరి ధర్మతేజ, రమేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

దొరికిన బంగారం అప్పగింత


హకీంపాషాను అభినందిస్తున్న గ్రామస్తులు

మిడ్జిల్: ఓ వ్యక్తి తనకు దొరికిన బంగారంను బాధితుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని బోయిన్‌పల్లికి చెందిన ప్రశాంత్‌రెడ్డి తన రెండు తులాల బంగారు గొలుసు సోమవారం మిడ్జిల్ బస్టాండ్ సమీపంలోని జిరాక్స్ సెంటర్ దగ్గర పోగొట్టుకున్నాడు. ఈ గొలుసు మిడ్జిల్‌కు చెందిన హకీంపాషాకు దొరికింది. అప్పటికే బంగారం పోగొట్టుకున్న ప్రశాంత్‌రెడ్డి చుట్టుపక్కల ఆరాతీసినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం హకీంపాషా తనకు దొరికిన గొలుసును ప్రశాంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి అప్పగించాడు. మంచి మనస్సుతో రూ.1.20 లక్షల విలువ చేసే బంగారు గొలుసును అప్పగించిన హకీంపాషాను గ్రామస్తులు సన్మానించారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.276 కోట్లు


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను మంజూరు చేయాలని సంబంధిత శాఖ మంత్రి కేటీఆర్‌ను కోరడం జరిగిందని, తన కోరిక మేరకు అడిగిన తక్షణమే రూ.276 కోట్లు విడుదల చేశారని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో జిల్లా అధికారులతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందిస్తున్న సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ మంత్రిని కోరడంతో సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తామని చెప్పారని తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ ద్వారా చేపట్టిన పనులతో పాటు, జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం, ఎంవీఎస్ కళాశాల స్టేడియం నిర్మాణం, అదేవిధంగా హౌసింగ్ శాఖ ద్వారా చేపట్టిన పనులు, పట్టాల పంపిణీ తదితర కార్యక్రమాలన్నిటినీ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి పెద్ద చెరువులోకి నీటిని నింపేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని, అదే విధంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు. అధికారులంతా పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. పెద్ద చెరువులో ప్లాట్లు కోల్పోయిన వారికి ఇంటి పట్టాలు ఇచ్చేలా, ఎనుగొండ రహదారి విస్తరణలో ఇళ్లు, స్థలాలు పోయిన వారికి, జర్నలిస్టులకు తదితరులకు పట్టాలు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా స్టేడియంలో చేపట్టిన పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ రవినాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు, ఆర్డీఓ అనిల్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ కేసీ నరసింహులు, హుడా చైర్మన్ గంజి వెంకన్న, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లు నరేందర్ రెడ్డి , సుబ్రమణ్యం, స్వామి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, ఇతర అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం

- టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగులకు టీఎన్‌జీఓ అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి అన్నారు. జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో టీఎన్‌జీఓ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో జేపీఎస్‌లు సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం జేపీఎస్‌ను రెగ్యులర్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఫ్రెండ్లీ ప్రభుత్వమని నిరూపించుకుందన్నారు. ఉద్యోగ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ కార్యదర్శి చంద్రనాయక్, కోశాధికారి కృష్ణమోహన్, నాయకులు రవీంద్రనాథ్, వెంకట్‌రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణకుమార్‌గౌడ్, చంద్రశేఖర్, ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు బాబన్న, కార్యదర్శి జ్ఞానేశ్వర్, రవి తదితరులు పాల్గొన్నారు.


సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీఎన్‌జీఓ నాయకులు, జేపీఎస్‌లు

ఆందోళనకరంగానే!

ఎంపీ అవినాశ్ మాతృమూర్తికి ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స

- క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్యం అందిస్తున్న విశ్వభారతి వైద్య బృందం
- తల్లి వద్దే ఉంటూ బాగోగులు చూసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాశ్
- సీబీఐ అధికారులు ఆస్పత్రిలోకి వచ్చారంటూ ఎల్లో మీడియా తప్పుడు వార్తలు
- దుష్ప్రచారాలను ఖండిస్తూ శాంతియుతంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల నిరసన


కర్నూలులోని విశ్వభారతి హాస్పిటల్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం విషమంగానే ఉంది. కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రి వైద్యుల బృందం క్రిటికల్ కేర్ యూనిట్(సీసీయూ)లో ఆమె ఆరోగ్యాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. ఎంపీ అవినాశ్ నిరంతరం అక్కడే ఉంటూ తల్లి బాగోగులు ఎప్పటికప్పుడు స్వయంగా చూసుకుంటున్నారు. వారిని పరామర్శించేందుకు రాయలసీమ జిల్లాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆస్పత్రికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఎంపీ అవినాశ్‌ను సీబీఐ అరెస్టు చేస్తోందంటూ తప్పుడు వార్తలకు తెర తీసిన ఎల్లో మీడియా తన విష ప్రచారాన్ని కొనసాగిస్తోంది. శ్రీలక్ష్మి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని వైద్యులు బులిటెన్ విడుదల చేయడం, ఓ వర్గం మీడియా తప్పుడు వార్తల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆస్పత్రి ఎదుట రోడ్డుపైనే సోమవారం రాత్రంతా గడిపారు. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు భారీగా బలగాలను తరలించారు.

సీబీఐ అధికారులు ఆస్పత్రిలోకి వెళ్లారంటూ..

పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఉంటున్న సీబీఐ అధికారులు అక్కడి నుంచి ఎస్పీ కార్యాలయానికి మాత్రమే వెళ్లారు. అయితే ఎల్లో మీడియా మాత్రం సీబీఐ అధికారులు విశ్వభారతి ఆస్పత్రిలోకి వెళ్లారని, అక్కడ పరిస్థితి, శ్రీలక్ష్మి ఆరోగ్యం గురించి వాకబు చేశారని దుష్ప్రచారం చేస్తూ డిబేట్లు నిర్వహించింది. విశ్వభారతి ప్రాంగణం, గాయత్రి ఎస్టేట్‌లో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని చెదరగొట్టి ఉద్రిక్తతకు దారితీసేలా కథనాలు ప్రసారం చేసింది. రోప్ పార్టీ పోలీసులు భోజనం చేసేందుకు వెళుతుంటే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారిపై ఆందోళనకు దిగినట్లు ఎల్లో మీడియా తప్పుడు వార్తలకు తెగబడింది. తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం మంగళవారం సాయంత్రం వరకూ అంతా ప్రశాంతంగా ఉండటంతో ఇక రాత్రికి అవినాశ్‌ను అరెస్టు చేసే అవకాశం ఉందంటూ మళ్లీ ప్రచారానికి తెరతీసింది.

శాంతియుతంగా నిరసన..

శ్రీలక్ష్మి, అవినాశ్‌ను పరామర్శించేందుకు ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేశ్, మేయర్లు సురేశ్‌బాబు, బీవై రామయ్య కడప, కర్నూలు కార్పొరేషన్ల కార్పొరేటర్లు ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, సుధాకర్, ఆర్థర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి నాలుగు రోజులుగా రాత్రింబవళ్లు ఆస్పత్రి వద్దే ఉంటున్నారు. ఎల్లో మీడియా దుష్ప్రచారాలను నిరసిస్తూ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు మంగళవారం రాత్రి 7 గంటలకు ఆస్పత్రి ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపారు. తన తల్లి ఆరోగ్యం కుదుట పడగానే 27 తర్వాత తానే స్వయంగా వస్తానని ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రకటించారని, మానవత్వంతో వ్యవహరించాలని సీబీఐ అధికారులకు సూచించారు.

అవినాశ్ ముందస్తు బెయిల్‌పై

నిర్ణయానికి ఇన్ని రోజులా!

- ఆదేశాలిచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడమేమిటి?
- 25న అవినాశ్‌రెడ్డి పిటిషన్‌పై నిర్ణయం తీసుకోండి
- తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచన
- బెయిల్ కోరే హక్కు పిటిషనర్‌కు ఉంది
- సునీత తరపు న్యాయవాదితో జస్టిస్ నరసింహ



సాక్షి, న్యూఢిల్లీ: ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిలుపై నిర్ణయం తీసుకోవడానికి ఇన్ని రోజులా అని తెలంగాణ హైకోర్టుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. అవినాశ్ పిటిషన్‌పై ఈ నెల 25న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపి తగిన ఆదేశాలివ్వాలని ఆదేశించింది. గతంలో మరో బెంచ్ విచారించినప్పటికీ వెకేషన్ బెంచ్ విచారణకు అడ్డంకి కాదని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణకు (జూన్ 5) వచ్చే వరకు సీబీఐ నుంచి మధ్యంతర రక్షణ కల్పించాలని లేదా తన పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ విచారించేలా ఆదేశాలివ్వాలంటూ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన అప్లికేషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన తర్వాత హైకోర్టు విచారించలేదా అని జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. హైకోర్టు రెండుసార్లు విచారించిందని, ఉత్తర్వులు ఇవ్వలేదని, జూన్ 5కు వాయిదా వేసిందని, మే 15న సీబీఐ నుంచి నోటీసులు వచ్చాయని అవినాశ్ తరఫున సీనియర్ న్యాయవాది వి.గిరి తెలిపారు. ఆ తర్వాత ఏం జరిగిందని ధర్మాసనం ప్రశ్నించగా.. సీబీఐ నోటీసులు ఇచ్చిందన్నారు. 'హైకోర్టులో విచారణ ఉండగా సీబీఐ నోటీసులు ఇవ్వడం గమనార్హం' అని అభిప్రాయపడిన ధర్మాసనం.. సీబీఐ విచారణకు హాజరు కాలేదు కదా అని అనగా.. ఏడుసార్లు పిటిషనర్ హాజరయ్యారని గిరి తెలిపారు. ఒక్క రోజు వ్యవధిలో రావాలని నోటీసులు ఇవ్వడంతో మూడు రోజులు సమయం కోరామన్నారు. సీబీఐ తరఫున ఎవరైనా హాజరయ్యారా అని ధర్మాసనం ప్రశ్నించగా.. ఎవరూ హాజరు కాలేదని వైఎస్ వివేకా కుమార్తె సునీత తరఫు న్యాయవాది లూథ్రా తెలిపారు. హైకోర్టులో ఏప్రిల్ 27న ఇద్దరి పిటిషన్లూ విచారణకు వచ్చాయని, సీజే వద్దకు వెళ్లినా ఎలాంటి ఆర్డర్ రాలేదని, జూన్ 5న మేటర్ జాబితా అయిందని లూథ్రా వివరించారు. జస్టిస్ నరసింహ జోక్యం చేసుకొని.. ఏమైనా అరెస్టు భయం ఉందా అని ప్రశ్నించారు. తాను మొదటి నుంచి అదే చెబుతున్నానని, ఇప్పటికే అవినాశ్ తండ్రి అరెస్టయ్యారని, తల్లి ఆసుపత్రిలో ఉన్నారని గిరి చెప్పారు. ఈ సమయంలో లూథ్రా జోక్యం చేసుకోవడంతో గిరి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. గిరిని ధర్మాసనం మందలించడంతో ఆయన ధర్మాసనానికి క్షమాపణలు తెలిపారు. బెయిలు కోరే హక్కు పిటిషనర్‌కు ఉందని ధర్మాసనం లూథ్రానుద్దేశించి వ్యాఖ్యానించింది. హైకోర్టు వెకేషన్ బెంచ్ గురించి ఆరా తీసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు వెకేషన్ బెంచ్ వినాలని సూచిస్తామని తెలిపింది. హైకోర్టుకు వెళ్లాలని ఇరువర్గాలకు తెలిపింది. అవినాశ్ వద్దకు వెళ్లాలని సీబీఐ ప్రయత్నించగా వందలాది మంది అనుచరులు అడ్డుకున్నారని లూథ్రా అనగా.. అవన్నీ సీబీఐ న్యాయవాది చెబుతారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం జస్టిస్ నరసింహ ఉత్తర్వులు వెలువరించారు.



తాగునీటి కోసం రాస్తారోకో

వెంకటాపురం(కె): తాగునీటి కోసం ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధిలోని ఉప్పేడు, గొల్లగూడెం గ్రామస్తులు మంగళవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. తమకు 15 రోజులుగా తాగునీరు అందడం లేదని.. సర్పంచ్, కార్యదర్శులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వెంకటాపురం(కె), భద్రాచలం రహదారిపై ఖాళీ బిందెలతో కూర్చున్నారు. సుమారు 2గంటల పాటు రహదారిపై ఆందోళన చేపట్టారు.

ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ టాప్

- ఇప్పటికి 5.56 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- 5.25లక్షల మెట్రిక్ టన్నులతో రెండో స్థానంలో నిజామాబాద్
- కొనుగోళ్లలో వెనుకబడిన 18 జిల్లాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తప్పడం లేదు. కొన్ని జిల్లాల్లో కొనుగోళ్లు నత్తనడకన నడుస్తుండగా, మరి కొన్ని జిల్లాల్లో వేగంగా జరుగుతున్నాయి. అత్యధికంగా కొనుగోలు చేసిన జిల్లాల్లో నల్లగొండ మొదటి స్థానంలో ఉంది. కొనుగోళ్లలో అనేక సమస్యలు ఎదురవుతున్నా జిల్లా యంత్రాంగం వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతోంది. సాధారణంగా ఏటా నిజామాబాద్ జిల్లాల్లో అత్యధికంగా ధాన్యం కొను గోలు చేస్తారు. ఈసారి మాత్రం నల్లగొండలో ఇప్పటికే అత్యధికంగా కొనుగోలు చేశారు. ఈ రెండు జిల్లాలతో పాటు మరో 10 జిల్లాల్లో కొనుగోళ్లు వేగంగా సాగుతున్నా మిగతా జిల్లాల్లో మాత్రం కొనుగోళ్లలో సమస్యలు తప్పడం లేదు. రాష్ట్రంలో 62,15,957 మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోగా అందులో ఇప్పటికి 56,72,270 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

తాలు తంటా.. మిల్లర్ల కొర్రీలు

రాష్ట్రంలోని 18 జిల్లాలు ధాన్యం కొనుగోళ్లలో వెనకబడ్డాయి. అందులో 9 జిల్లాల్లో కొనుగోలు లక్ష్యంలో సగం ధాన్యం కొనుగోలు చేయకపోగా, మరో 9 జిల్లాల్లో పావలావంతు ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. భూపాలపల్లి, ములుగు, నాగర్‌కర్నూల్, వికారాబాద్, రంగారెడ్డి, జోగుళాంబ గద్వాల, మేడ్చల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు ధాన్యం కొనుగోళ్లలో వెనుకబడ్డాయి. మరికొన్ని జిల్లాలు లక్ష్యంలో సగం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. అందులో యాదాద్రి, మెదక్, సిద్దిపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నారాయణ్‌పేట, నిర్మల్, వరంగల్, కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి.

అనేక చోట్ల అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవడం, కొన్నిచోట్ల తడిచిన ధాన్యం మొలకెత్తడం, మరికొన్ని తాలు ఉందంటూ మిల్లర్లు నిరాకరించడం వంటి సమస్యలతో కొనుగోళ్లు వేగంగా సాగడం లేదు. ముఖ్యంగా మిల్లర్ల కొర్రీలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈసారి వర్షాకాలం సీజన్ సాగును ముందే ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో కొనుగోళ్లలో వేగం పుంజుకోకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన దిగుబడి.. తగ్గని రాశులు

గతంలో ఎప్పుడూ లేనట్లుగా పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి వచ్చింది. ఎక్కడ చూసినా ధాన్యం రాశులే. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోళ్లు వేగంగా సాగుతున్న జిల్లాల్లోనూ ఇంకా కల్లాల్లో ధాన్యం ఒడవడం లేదు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే చూస్తే గత సీజన్‌లో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ఈసారి ఇప్పటికే 5.56 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేసినా ఇంకా కల్లాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి.

ప్రత్యేక చొరవతోనే..

నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపుతోంది. అధికారులు మొదట్లో 272 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ సీజన్‌లో ధాన్యం అధికంగా దిగుబడి రావడం, దానికితోడు అకాల వర్షాలు రావడంతో త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని మరో 100 కొనుగోలు కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేసి కొనుగోళ్లను ముమ్మరం చేశారు. జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి 45 రోజులుగా ప్రతి రోజు నాలుగైదు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పర్యటిస్తున్నారు.

రోజుకు లక్షన్నర టన్నుల ధాన్యం సేకరణ

- ఇప్పటివరకు 38.50 ఎల్ఎంటీ ధాన్యం సేకరణ
- ధాన్యం కొనుగోళ్లపై మంత్రి గంగుల కమలాకర్ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్న తీరు సంతృప్తికరంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్, కార్పొరేషన్ జీఎం రాజారెడ్డి తదితరులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సగటున రోజుకు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు యాసంగి ధాన్యాన్ని 38.50 లక్షల మెట్రిక్ టన్నుల మేర సేకరించామని, ఇది గత సీజన్ కన్నా 10 లక్షల మెట్రిక్ టన్నులు అధికమని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించినంత సహకారం లేకున్నా, రైతుల నుంచి కనీస మద్దతు ధరతో సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు అనుకూల విధానాల కారణంగా ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని, గతంలో ఎన్నడూ లేనంతగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతున్న పరిస్థితులు ఉన్నాయని అన్నారు. అకాల వర్షాలతో పలు జిల్లాల్లో కోట్లాది రూపాయల ధాన్యం నేలపాలైందని, వారిని కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మంగళవారం వరకూ రాష్ట్రవ్యాప్తంగా 7 వేల కొనుగోలు కేంద్రాల ద్వారా రూ. 7,907 కోట్ల విలువ గల ధాన్యాన్ని 6 లక్షల మంది రైతుల నుంచి సేకరించినట్లు తెలిపారు. ఇప్పటికే 400కి పైగా కొనుగోలు కేంద్రాల్లో సేకరణ పూర్తి కాగా, వాటిని మూసేసినట్లు చెప్పారు. ఎఫ్‌సీఐ నిర్దేశించిన కనీస నాణ్యతా ప్రమాణాలను రైతులు పాటిస్తూ, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశామని, అక్కడక్కడా ఎదురవుతున్న సమస్యలపై ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం స్పందిస్తుందని, రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మంత్రి అదేశించారు.

సదాశివయ్యకు ఉత్తమ జీవవైవిధ్య పరిరక్షణ అవార్డు



జడ్చర్ల టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు సదాశివయ్యకు జీవవైవిధ్య పరిరక్షణ అవార్డు దక్కింది. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ భాస్కర్ ఆడిటోరియంలో జరిగిన సభలో మండలి చైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ అవార్డును సదాశివయ్యకు అందజేశారు. పదేళ్లలో జీవవైవిధ్య పరిరక్షణకు చేసిన కృషికి గుర్తింపుగా అవార్డు దక్కింది. ఒక్కడే 6వేలకుపైగా పాములను సంరక్షించటం, 600 మొక్కల జాతులను బొటానికల్ గార్డెన్‌లో సంరక్షిస్తున్నారని, అంతరించిపోతున్న మొక్కలను సంరక్షించటం, అడవుల నుంచి ఐదుకొత్త మొక్కలను ప్రపంచానికి అందించడం, వనపర్తి గుట్టల్లో సంజీవని మొక్కను కనుగొనటం, 6లక్షల మంది విద్యార్థులకు జీవవైవిధ్యంపై అవగాహన కల్పించడంతో అవార్డును అందజేసినట్లు మండలి ప్రధాన కార్యదర్శి కాళీచరణ్ కథర్డే ప్రకటించారు. సదాశివయ్యకు అవార్డు పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ, అధ్యాపకబృందం, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఏడాది గడువు కావాలె..

ఊరు వదిలేందుకు చిన్నోనిపల్లె వాసుల డిమాండ్

- రిజర్వాయర్‌ను సందర్శించిన ఆర్డీఓ, డీఎస్పీలు
- పనులను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటాం
- చర్చల ద్వారే సమస్యలకు పరిష్కారమన్న అధికారులు


ఆర్డీఓ రాములుకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

గట్టు: చిన్నోనిపల్లె ఊరిని విడిచి పెట్టాలంటే కనీసం ఏడాది గడువు కావాలని, పునరావాస కేంద్రంలో రేకుల గుడిసె వేసుకోవాలన్నా కనీసం నాలుగు, ఐదు నెలల సమయం పడుతుందని, ఏడాది గడువు ఇచ్చి, సౌకర్యాలు కల్పిస్తే ఊరు విడిచి పెడతామని చిన్నోనిపల్లె నిర్వాసితులు ఆర్డీఓ రాములు, గద్వాల డీఎస్పీ రంగస్వామితో మొర పెట్టుకున్నారు. మంగళవారం గద్వాల ఆర్డీఓ రాములు, డీఎస్పీ రంగస్వామి, సీఐ చంద్రశేఖర్, ఇరిగేషన్ శాఖ అధికారులు చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ పనులను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని గద్వాల డీఎస్పీ రంగస్వామి హెచ్చరించగా, మా శవాలను రాళ్లుగా పేర్చి రిజర్వాయర్ కట్టను కట్టండని నిర్వాసితులు వాపోయారు. వివాదాలు వద్దని, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని నిర్వాసితులకు డీఎస్పీ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల దగ్గరకు వెళితే ఎవరూ పట్టించుకోవడం లేదని, అందుకే పనులను అడ్డుకుంటే అధికారులు ఇక్కడికి వస్తారని, అందుకే పనులను అడ్డుకుంటున్నట్లు నిర్వాసితులు తెలిపారు. రిజర్వాయర్ కట్ట నిర్మాణం రాత్రి పగలు కొనసాగుతున్నాయని, వర్షాకాలంలో వాగుల్లోని వర్షపు నీరు గ్రామాల్లోకి రావడం ఖాయమని నిర్వాసితులు తెలిపారు. పునరావాస కేంద్రంలోకి మారడానికి ఏడాది గడువు కావాలని నిర్వాసితులు అధికారులకు విన్నవించారు. ఎకరాకు రూ.పది లక్షల పరిహారం చెల్లించాలని, ఇల్లు కట్టుకోవడానికి రూ.2లక్షలు సరిపోవని, రూ.10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్లాట్లు ఇవ్వాలని, గ్రామంలోని యువతకు ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆర్డీఓకు నిర్వాసిత రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. సౌకర్యాల కల్పనపై నిర్వాసితులు గద్వాల ఆర్డీఓ కార్యాలయానికి రావాలని, సమస్యలపై చర్చించి పరిష్కరించుకుందామని ఆర్డీఓ రాములు నిర్వాసితులకు సూచించారు.

నకిలీ పట్టాలపైనే మక్కువ..

చిన్నోనిపల్లె ముంపు భూముల్లో నకిలీ అసైన్డ్ పట్టాలకు పరిహారం చెల్లించడానికి చూపించే ఆసక్తిని, నిర్వాసిత రైతుల సమస్యలు, పరిహారం చెల్లింపుపై ఎందుకు చూపడంలేదని నిర్వాసితులు గద్వాల ఆర్డీఓ రాములును ప్రశ్నించారు. ఇప్పటికీ ముంపు భూములకు సంబంధించిన కొన్నింటికి పరిహారం చెల్లించాల్సి ఉందని, పునరావాస సమస్యలు, పట్టా సమస్యలు అట్లానే ఉండిపోయినట్లు తెలిపారు. వీటిని వదిలేసి, నకిలీ అసైన్డ్ పట్టాలకు సంబంధించి పరిహారం చెల్లించడానికి అధికారులు, సర్వేయర్లు విచారణ చేయడానికి ఎందుకు అమితాసక్తి చూపుతున్నారని అధికారులను ప్రశ్నించారు.

ప్రతి మనిషి భక్తిభావంతో మెలగాలి


జగద్గురువులను సన్మానిస్తున్నా నేరడగం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగా మహాస్వామి

మాగనూర్: ప్రపంచంలో ఉన్న అన్నిజాతులు, మతాలు, ధర్మాల కంటే మానవ ధర్మము అతి ఉత్తమమైనదని, మనిషి ఆ ధర్మాన్ని కాపాడాలని జగద్గురు డాక్టర్ శ్రీ చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి శ్రీశైల పీఠాధిపతి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నేరడగం పక్షిమాద్రి విరక్త మఠంను సందర్శించి ఆలయంలో పూజలు నిర్వహించారు. అంతకుముందు మల్లికార్జునస్వామి, చెన్నబసవ, శంఖర్ ఆధ్వర్యంలో అర్చక బృందం వేదమంత్రోచ్చరణల మధ్య పూర్ణకుంభంతో స్వామి వారిని మఠంలోకి ఆహ్వానం పలికారు. అనంతరం మఠం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగ మహాసామి, నేరడగం సర్పంచ్ అశోక్‌గౌడ్ జగద్గురువులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతం ఆధ్యాత్మికతకు ప్రసిద్ధి చెందిందని, ప్రజల్లో భక్తిభావాలను పెంపొందించుటకు పంచమ సిద్ధలింగా మహాస్వామి విశేష కృషి చేస్తున్నాడని కొనియాడారు. అనంతరం భక్తులకు ఆశీర్వాదం చేయడం జరిగింది. కార్యక్రమంలో శ్రీ క్షీరలింగ మహాస్వామి, శ్రీ శంభులింగా మహాస్వామి, వీరేంద్రపాటిల్, రాజప్పగౌడ, విద్యాసాగర్, మల్‌రెడ్డి, శివరాజరెడ్డి పాల్గొన్నారు.

బీఎస్పీ సేవలు విస్తృత పరుస్తాం


అలంపూర్‌లో గొడుగులను అందజేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- అలంపూర్‌లో చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ

అలంపూర్: బీఎస్పీ ద్వారా అలంపూర్‌లో సేవలు విస్తృతపరుస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. బీఎస్పీ బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం పర్యటించారు. మిషన్ ఆర్ఎస్పీలో భాగంగా అలంపూర్ మున్సిపాలిటీలోని కూడలిలో చిరు వ్యాపారులకు నీడ కల్పించాలనే ఉద్దేశంతో బీఎస్పీ గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు ముదిరిన కారణంగా చిరువ్యాపారులకు నీడను కల్పించడానికి గొడుగులను అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీరితోపాటు జిల్లా అధ్యక్షుడు కేశవరావు, నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, ఇన్‌చార్జులు కనకం బాబు, మధు గౌడ్, నాయకులు సుంకన్న, నాగరాజు, నాగజ్యోతి, రవిచంద్ర ఉన్నారు.

రైతులను దోచుకుంటున్న ప్రభుత్వం

ఎర్రవల్లి చౌరస్తా: రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ప్రభుత్వం తరుగు పేరుతో రైతులను నిట్టనిలువునా దోచుకుంటుందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి ఇటిక్యాల మండలంలోని ఆర్. గార్లపాడు, కారుపాకుల, వీరాపురం, దువాసిపల్లి, సాసనూలు, షేకుపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి కష్టపడి రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు కొనుగోలు సెంటర్లలో వరి కుప్పలను పోసుకొని ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ రైతు వ్యతిరేకి, రైతు ద్రోహి అని మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వం ఐకేపీ సెంటర్ల ద్వారా వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి మిల్లర్ల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

మర్రిచెట్టు నీడలో 5రోజులు..

- రుక్కంపల్లికి తరలివచ్చిన రాష్ట్ర కాంగ్రెస్ నేతలు


మర్రి చెట్టు కింద భట్టి విక్రమార్క

నవాబుపేట: పీపుల్స్ పాదయాత్రలో భాగంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క బస చేసిన రుక్కంపల్లి గ్రామం కాంగ్రెస్ పార్టీకి మరో వార్‌రూంగా మారిపోయింది. పాదయాత్రతో అస్వస్థతకు గురైన భట్టి విక్రమార్క ఇక్కడ ఏర్పాటు చేసిన బస దగ్గరే ఐదురోజులపాటు విరామం తీసుకున్నారు. ఈ క్రమంలో మర్రిచెట్టు నీడన తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నాయకులు గంటల తరబడి చర్చలు జరిపారు. ఈ నెల 18న ఆయన పాదయాత్రకు విరామం ప్రకటించి రుక్కంపల్లి గ్రామ సమీపంలోని పొలాల వద్దే విశ్రాంతి తీసుకుంటూ చికిత్స పొందారు. ఈ క్రమంలో 18న ప్రజా యుద్ధ నౌక గద్దర్ భట్టిని పరామర్శించారు. ఆ తర్వాత 19న కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హన్మంతురావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ, రాములునాయక్ సందర్శించారు. 20న రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచందర్‌రావు, 21న పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, పీసీసీ ఐటీ సెల్ చైర్మన్ మదన్‌మోహన్‌రావు వరుస కట్టారు. ఇలా ఒక్కొక్కరుగా రుక్కంపల్లికి చేరుకుని భట్టి విక్రమార్కను పరామర్శించడంతోపాటు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సమాలోచనలు చేయడం విశేషం.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చేయూత

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలోని పేద బ్రాహ్మణులకు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అన్ని విధాలుగా చేయూత అందిస్తుందని పరిషత్ డైరెక్టర్ జ్యోషి గోపాలకృష్ణశర్మ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బ్రాహ్మణుల స్థితిగతులు చూసి చలించిన సీఎం కేసీఆర్ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటి వరకు సంక్షేమ పరిషత్ ద్వారా 6,800 మంది నిరుపేద బ్రాహ్మణులకు సహకారం అందించామని, 720 మంది బ్రాహ్మణ విద్యార్థులకు విదేశీ చదువుల కోసం రూ.20 లక్షల ఆర్థికసాయం అందించినట్లు చెప్పారు. బోపన్‌పల్లిలో 6 ఎకరాల్లో రూ.12 కోట్ల నిధులతో అధునాతనమైన బ్రాహ్మణ సదనం (బ్రాహ్మణ భవన్) ఏర్పాటు చేశామన్నారు. ఇందులో మఠాధిపతుల వసతి, విద్యార్థుల కోచింగ్‌కు కోసం భవనం, కల్యాణ మండపాన్ని నిర్మించామని, దీనిని ఈ నెల 31న సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని, కార్యక్రమానికి దేశంలోని పీఠాధిపతులు, ఆలయాల ప్రధాన పూజారులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు గొండ్యాల రాఘవేంద్రశర్మ, తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, రాజ్‌కుమార్, సంతోషాచార్యులు, దత్తప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ డైరెక్టర్ జ్యోషి గోపాలకృష్ణశర్మ